'మాతృమూర్తి కావాలన్న కాంక్ష స్త్రీకి సహజం మంతే కలుగుతుందేమో! అటువంటి వృత్తి చూపించి తన పిల్లలని చెప్తుకుంటూ నీళ్ళు పోసి, పాలు పట్టి, జోల పాడి నిద్రపుచ్చి మురిసిపోతూంటుంది. తల్లి కాలేని స్త్రీ జీవితంలో పరిపూర్ణత ప్రాప్తం కాదు. గొడ్డుతనం స్త్రీ జీవితానికే గొడ్డలిపెట్టు!'

నిశ్శబ్ద నిశీథిలో కీచురాళ్ళ అరుపులు వింటూ, ఇంటి చూరుకప్పు వేపు చూస్తూ పడుకున్నాను. ఆ కీచురాళ్ళలాగే నా హృదయంకూడా ఆక్రోశిస్తోంది. బయట సన్నని తుంపర పడుతోంది. ఈదురుగాలికి చలితో శరీరంలో వెంట్రుకలు నిక్కపొడుచుకున్నాయి. దుప్పటిలో ముడుచుకుని పడుకున్నాను. ఆయన ఇంకా కొంపకి రాలేదు. ఉండి ఉండి చలికి కాపాలా నక్కలు అరుస్తున్నాయి. గుండెల్లో గుబులు పుడుతోంది! ఒంటరితనం వింతగా బాధిస్తోంది. ఎంత ప్రయత్నించినా నిద్ర రావడం లేదు. ఈమధ్య ఆయన మరీ మారిపోతున్నారు. ఇదివరకెప్పుడూ లేనిది నామీద వెంట్లు చేస్తున్నారు. తలుచుకుంటే కళ్ళలోనించి నీళ్ళు ఉబ్బిసని ఉరుకుతున్నాయి. గుండెల్లో ఏదో అర్థంకాని బాధ నన్ని పోటులాగా ప్రారంభమవుతుంది. నా భర్త ఈమధ్య ఇంటికికూడా ఆలస్యంగా వస్తున్నారు. నేను ఒకటి రెండుసార్లు అడగబోతే విసుక్కున్నారు. 'ఛీ పాడు బతుకు! నాదీ ఒక జన్మేనా?' అనుకుంటుంటే వెక్కిళ్ళు ఆగడం లేదు! తనేం తప్పు చేసిందని తనకీ పరీక్ష ?

పక్క వచ్చిన దగ్గరనించీ తనకి మరీ తీవ్రంగా ఉంది. చీటికిమాటికి తనమీద విరుచుకు పడుతుంది. అత్త గారు ఇంట్లో ఉన్నంతసేపు పక్కనే ఉండే ఆడబిడ్డ, ఆయన బయటికి వెళ్ళేసరికి ఎందుకిలా మారి పోతుందో, ఎంత ఆలోచించుకున్నా తనకి బోధపడ్డం లేదు. మనిషిని ఎంత సమాధాన పరుచుకోవాలనుకున్నా, ఈ రోజు తన ప్రవర్తనలో లేశమాత్రం దోషం కనిపించడం లేదు! అయినా, తనకి దండన తప్పలేదు!

బుజ్జిగాడు అదేపనిగా కేకపెట్టి ఏడుస్తున్నాడు. పక్క సముదాయించలేక తంటాలు పడుతోంది. తన మనసు స్థిమితంగా ఉండబట్టలేక, రుద్దుతున్న వస్తువుని మధ్యలోనే వదిలి, చేతులు కడుక్కుని గబగబా వక్కింట్లోకి వచ్చింది. సరిగ్గా అదేసమయానికి పక్క బుజ్జిగాడి వీపుమీద ధడధడ మని నాలుగు అంటించింది. తన హృదయం చివుక్కుమంది. తన్నెవరో కొరడాతో చెళ్ళున కొట్టినట్టు విలవిల్లాడిపోతూ పరిగెత్తుకు వెళ్ళి, బుజ్జిగాణ్ణి ఎత్తుకుని హృదయానికి గట్టిగా హత్తుకుంది. తల్లి దండన తప్పించి తనని చేరదీసి నందుకు కృతజ్ఞతతో బాబు తనని పెనవేసుకున్నాడు. స్త్రీ సహజమైన మాతృత్వం నాలో పెల్లుబికింది. బాబుని గాఢంగా హృదయానికి హత్తుకొని గదిలోకి తీసుకువెళ్ళాను. బాబుని సముదాయించి, కొద్దిగా గ్లాసుతో నీళ్ళు పట్టించి, భుజంమీద వేసుకుని తిప్పుతున్నాను. బాబు ఏడుపు మానేసినా వెక్కిళ్ళు మాత్రం మధ్య మధ్యలో వస్తున్నాయి. బాబు కునికిపాట్లు పడు తున్నాడు. పడుకోబెట్టి మిగిలిన వంటపని పూర్తి చెయ్యాలింకా. పక్క పరిచేసి, తలగడా దిండు మధ్యకి లాగి, దిండుమీద తలపెట్టి బోరగిలా పడుకోబెట్టాను వాణ్ణి. వీపుమీద మెల్లగా వేలికొసలు తాకిస్తూ తట్టి



పడ్డాను. బంగారంలా మెరిసిపోతున్న బాబు వీపుమీద ఎర్రని ఆ వేలిముద్రలు చూసేసరికి కళ్లంట నీళ్లు చిందాయి. హృదయం చివుక్కుమంది. 'ఛీ ఛీ! పసివాణ్ణి అంతలా చావకొడతారా ఎవరైనా? బుద్ధి ఉండక్కర్లా?' అనుకుంటూ విసుక్కున్నాను. పద్మకి చూపించి మందలించా లనుకున్నాను. అంతలోనే గతం గుర్తువచ్చి చచ్చినట్టు ఊరుకున్నాను, వంటపనిలో చొరబడి. పచ్చడి రుబ్బుతున్నంతసేపు పద్మ చేసిన కసాయిపనికి నా మనస్సు చిటపటలాడుతూనేఉంది. తనకి పిల్లల్లేనిమాట వాస్తవమే కాని, పిల్లలంటే వల్లమాలిన ప్రేమ. స్త్రీ సహజమైన మాతృ హృదయం తనకి ఉంది. పద్మకి చెప్పినా అర్థం కాదు. ఇదివర కొకసారి ఇలాగే బాబు పాలు కావాలని గుక్కపట్టి ఏడుస్తూంటే, పద్మ టైమవలేదని ససేమిరా పట్టకుండా మొండి కెత్తి కూర్చుంది. బాబుకి అసలే ఆ రోజున రెండు విరోచనా లైనాయి. నీరసంగా ఉన్నాడు. "మొహం తిరుగుతుంది, కాసిన్ని పాలివ్వు, పద్మా!" అంటే తనమీదకి తారాజువ్వలా లేచింది. "గొడ్రాలికి బిడ్డసార మేం తెలుస్తుంది, వదినమ్మా? అసలే పిల్లాడికిఅజీర్ణంగా ఉంది. వేళాపాళా లేకుండా ఏడుస్తున్నాడని పాలు పడితే బ్రతికుండడానికా, చావడానికా? కనిపెంచిన వారికి తెలుస్తుంది కాని, నీలాంటి మోడువారికి ఎలా తెలుస్తుందిలే పిల్లలతత్త్వం?" అంటూ నానా మాటలు అంది. "వాడి బాగోగులు నాకు తెలుసు! వాడి ఆకలి తల్లినైన నా కంటే నీకు బాగా తెలుసా ఏం? వాడి ఆహారం విషయంలో నువ్వు అనవసరంగా కలగజేసుకుని పద్మ అన్నది తరవాత బాధపడి ప్రయోజనం లేదు. ఇప్పుడే చెబుతున్నాను, ఏమ!" అంటూ నోటికి వచ్చినట్లల్లా అని ఊరుకుంది.

తనకి పిల్లలు లేరు, నిజమే. అది తనే జన్మలో చేసుకున్న పాపమో! అంతమాత్రంచేత తనకి పిల్లల విషయమే తెలీదనడం మూర్ఖం. పుట్టింట్లో అన్నయ్య పిల్లలు తన చేతిమీదుగానే పెరిగారు. చిట్టిగాడైతే మాటలు వచ్చినదగ్గరనించి 'అత్త, అత్త' అంటూ అన్ని పనులు తనచేతే చేయించుకునేవాడు వాళ్లమ్మని కాదని. తను గోరుముద్దలు తినిపించకపోతే ఆ రోజు వాడికి అర్ధాకలే. తల్లిని నానా గొడవ చేసేవా డా మూడు రోజులు. వదినకి ప్రాణం విసిగితే "శాంతీ, నువ్వు అత్తారింటికి వెళుతున్నప్పుడు అల్లుణ్ణి హరణం తీసుకెళ్లు, తల్లీ. వీణ్ణి భరించడం నా వల్ల కాదు. ఆ మొండిఘటం నీకే తప్ప నాకు లొంగడు!" అని ఉడుకుమోతుతనంతో వదిన అంటే తనకి నవ్వు వచ్చేది. తను నవ్వితే వదిన మరీ మూతి ముడుచుకుని, "నీకూ తెలుస్తుందిలే వీళ్లాంటి గడుగ్గాయి ఒకడు పుడితే!" అంటూండేది. అలాంటి తనకి పిల్లల పెంపకం తెలీదా? కనకపోతేమాత్రం స్త్రీకి మాతృ హృదయం ఉండదా? మమకారం ఉండదా? ఎందుకు పద్మ మరీ అంతలా నోరు పారేసుకుంటుంది? ఏమైనా అనబోతే తగుదునమ్మా అని అన్నగారితో రిపోర్టుకి బయలుదేరుతుంది. అన్నీ లేకి బుద్ధులే! తన పుట్టింట్లో తను వదినల దగ్గర ఇలాగే ఉండేదా? ఎంత ప్రాణం పెట్టేవారు తనంటే! 'అయ్యో, ఆడబిడ్డ సంవత్సరాని కొసారి వస్తుందికదా' అని ఎంత సరిపుచ్చుకున్నా, అబ్బో విసిగించి చంపుతూంటుంది కదా! అందుకే ఆమె ఏమన్నా, రభస

> పిల్లలకోసం ఒక స్త్రీ పడే తపన, పిల్లలు లేని లోటు ఏ తల్లికి అర్థంకావు. పిల్లలు లేని స్త్రీ మాత్రమే అర్థం చేసుకోగలదు ఆ రంపపు కోత. గొడ్డుతనం స్త్రీ జీవితానికి నిజంగానే గొడ్డలిపెట్టు. బాధ్యత ఎవరిదైనా బాధ అనుభవించడం కన్న మార్గాంతరం లేదు గొడ్రాలికి.

జరగడం ఇష్టంలేక పడి ఉంటుంది అక్కడికీ తను. అయినా తన అక్కస్సు అంతా బుజ్జిగాడిమీద చూపి వాణ్ణి చావుదెబ్బలు కొడుతుంది. తన్నేమన్నా సహిస్తుంది గాని బుజ్జిగాడిమీద చెయ్యి చేసుకుంటే సహించలేదు. పద్మ బాబుని కొట్టే దెబ్బలు సరాసరి తన హృదయానికి సమ్మెటపోటుల్లా తగులుతూంటాయి.

మధ్యాహ్నం అన్నం వడ్డిస్తూంటే "బుజ్జాయి ఏడీ?" అన్నారాయన. వారు అన్నం తిన్నంతసేపు వాడు పక్కని కూర్చుని అల్లరిచేస్తేకాని ఆయనకి తిన్నట్టుండదు. పద్మ పురిటికి వచ్చిన ఈ మూడు మాసాలనించీ మరీ చేరికయ్యాడు ఆయనకి. బుజ్జి నడిగేసరికి పద్మ ప్రవర్తన గుర్తువచ్చి ఆక్రోశిస్తూన్న హృదయాన్ని అణగదొక్కుతూ పడుకున్నా డన్నాను ముభావంగా. లేపి తీసుకురమ్మంటే వద్దంటూ మొహం తిప్పుకుని మజ్జిగ పోసి అక్కణ్ణించి లేచి వెళ్లిపోయాను, ఏం ప్రశ్నిస్తారోనన్న భయంతో. ముఖ్యంగా పద్మ ఎక్కడ కలగజేసుకుంటుందోనని తనకి భయం.

భోజనం చేసి గదిలోకి వెళ్లిన శ్రీవారి కేకకి గది ప్రతిధ్వనించింది. 'ఏం అవాంతరం వచ్చిందో'నని కాళ్లు వణుకుతుంటే తీస్తున్న కంచం అక్కడే ఎత్తేసి పరిగెత్తాను గదిలోకి. బుజ్జాయిమీదనించి దృష్టి తన మీదికి మళ్లిస్తూ "ఏమిటిది?" అంటూ గద్దించారు. వెన్నెలవంటి ఒంటిపై ... [illegible]

"హా — వా డేడుస్తూంటే మన్నేం చేస్తున్నావ్? పెద్దపుత్రాసికి వళ్ళు తోముతున్నావా? ఎత్తుకుంటే అరిగిపోతావా? వాణ్ణి చావగొట్టేవరకు నీకు తీరలేదన్న మాట!" అంటూ చెంప ఛెళ్లు మనిపించారు.

అనుకోని ఈ హఠాత్సంఘటనకి తెల్లబోయి, తెప్పరిల్లి గుడ్లనీళ్లు కుక్కుకుంటూవస్తున్నదుఃఖాన్ని దిగమింగాను. ఈ దెబ్బ పద్మకి తగిలితే తెలిసేది, బాబుకి ఆవిడగారి దెబ్బ ఎంత నొప్పి కలిగించిందో. హుఁ! ఇద్దరి కిద్దరే అన్నా చెల్లెళ్లు! కళ్లు తుడుచుకుంటూ బాబు పక్కని చతికిలబడ్డాను. ఆయనగారు గబగబా బట్టలు వేసుకుని ఆఫీసుకి బయలుదేరారు. చేసేది లేక బాబుని చూస్తూ కూర్చున్నాను.

ఇంతలో పద్మ గుర్తు వచ్చింది. పాపం, బాబుని కొట్టినందుకు ఆమెకి మాత్రం బాధగా ఉండదా? ఏదో ఓపలేని మనిషి కనక కోపంలో కొట్టింది. తనే ఇంత బాధ పడుతూండే, ఆమె కింకెంత బాధగా ఉందో? అసలే వట్టి మనిషికూడా కాదు. గబగబా లేచి వంటింట్లోకి వెళ్లి ఇద్దరికీ వడ్డించి పద్మని రమ్మని కేక వేశాను. ఆకలిగా లేదంటూ గ్లాసెడు నీళ్లు తాగి వెళ్లబోయింది. "నిండు చూలాలు అభోజనంగా ఉండకూడదు, పద్మా, ఏదో చికాకులో కొట్టిఉంటావు. దాని కింత బాధపడ్డం ఎందుకు? అసలే గర్భిణివి. ఇలా తిండి మానేస్తే ఒంటికి మంచిదికాదు. బాబు లేస్తే నేను చూస్తానులే! నువ్వు తిను" అంటూ చెయ్యి పట్టుకున్నాను.

**కుమారి శేషు**


పట్టుకున్న చేతిని విసురుగా వెనక్కి తోసి "కడుపుతో ఉన్న వాళ్లు తీసుకోవలిసిన జాగ్రత్తలు నాకు తెలుసులే వమ్మా! ఇదివరకు కన్నదాన్నే. నువ్వేం చెప్పక్కర్లేదు" అంటూ కసురుకుంది.

హృదయం బాధగా మూలిగింది. 'ప్రతి మాటకి పద్మ తన నెందు కిలా చిత్రవధ చేసేలా మాట్లాడుతుంది? అవిటివాడికి వేరే "ఒరేయ్, నువ్వు అవిటివాడివిరా!" అంటూ వేలెత్తి చూపించితేకాని వాడికి తెలీదా? చచ్చిన పాము నింకా చంపడమే మానవ నైజమా? పిల్లలు పుట్టకపోతే అది కేవలం తన ఒక్కర్తి దోషమేనా? నా పుట్టింట్లో ఎవరికి లేరు పిల్లలు? అక్కలకి, అన్నలకి అందరికీ ఉన్నారే! తను మాత్రం గొడ్డు దెందు కౌతుంది? ఈమాత్రం వాళ్ళెందుకు తెలుసుకోరు? ఆపరేషను చేస్తే సంతానం కలుగుతుందని డాక్టరు చెప్పింది కూడా. ఆయనగారే ఒప్పుకోలేదు. తనేం చేస్తుంది మధ్య? ఛీ!ఛీ! గొడ్రాలుగా బ్రతికి అందరిచేత నానా మాటలు తినేకంటే చస్తే నయం కాదూ?' లావాలా మరుగుతూంది హృదయం.

మొన్నటికి మొన్ననూ అలాగే. పేరంటానికి వెళ్లింది పక్కవీథిలో సుభద్రమ్మగారింటికి. పొత్తిళ్లలో పాపని సుభద్రమ్మ తన కందిస్తూంటే, "జాగ్రత్త, కోడలు పిల్లోయ్! సరిగ్గా అందుకోకపోతే మెడలు విరుగుతాయి. నీ కసలే చాతకాదేమో!" అంటూంటే తనహృదయంలో గాయం కలుక్కుమంది, ఆ పెద్దముత్తైదువు అన్న మాటలికి! పిల్లల్లేనివారికి పిల్లల్ని ఎత్తుకోవడంకూడా చేతకాదా? అసలు ఆడపిల్లలకి ఒకరు చెప్పేదేమిటి పిల్లల్ని ఎత్తుకోవడం? వారికి సహజంగా వెన్నతో పెట్టిన విద్యేగా అది. బాధపడుతున్న హృదయాన్ని సమాధానపరుచుకుంటూ, పాపని ఒళ్లో వేసుకుని మెల్లిగా ఊపుతూ పలకరిస్తూంటే పాప బోసిగా నవ్వుతూంది.

"చూశావా, వదినమ్మా? ఒళ్లో పిల్లడుంటే మరద లెంత నిండుగా ఉందో!" అంది మరో పేరంటాలు తనవేపు చూపుతూ.

చెప్పద్దూ? నాకు ఒళ్లు మండింది. "సంతానం స్త్రీకి పరిపూర్ణత ప్రసాదిస్తుందని ఈవిడగారు వేరే చెబితేకాని తెలీదు కామోలు! ఎక్కడికి వెళ్లినా తన కీ చిత్తక్షోభ తప్పదులా ఉంది! రోజు కోమారైనా ఆయనా అలాగే దెప్పి పొడుస్తున్నట్టు మాట్లాడతారు. పద్మ సరేసరి. 'పుత్రులు పున్నామ నరకం నించి తప్పిస్తారో లేదోకాని, ఈ సమాజమనే నరకంనుంచి మాత్రం తప్పక రక్షిస్తారు!' పిల్లలు లేనివారికి సమాజం నరకప్రాయమే! పిల్లలు కావాలని ఏ స్త్రీ మాత్రం కోరుకోదు? పిల్లలు లేని ఇల్లు బావురుమంటుంది. ఆ నిశ్శబ్దాన్ని భరించడం ఎంత కష్టం! మగవాళ్లు వీథిలోకి వెళ్లిపోతే వీళ్ళేగా ఊసు? పిల్లలు లేని స్త్రీకి జీవితమే దుర్భరం. గొడ్డుతనం స్త్రీ జీవితానికే గొడ్డలిపెట్టు. పిల్లల్లేని




ఇంట్లో ముద్దుముచ్చట్లు, మురిపాలు ఉండవు. భార్యాభర్తలమధ్య దాంపత్య సుఖం ఉండదు. అనుకూలం వర్తన, అనురాగం కొరత పడతాయి. ఎక్కడో మాటికి ఒకరు సంతానం లేకపోయినా అన్యోన్యంగా ఉంటారేమో కాని సర్వసాధారణంగా ఎడముఖం పెడముఖంగానే ఉంటారు. భార్యాభర్తల హృదయాల్ని పరస్పరానురాగ బంధంలో శాశ్వతంగా బంధించి ఉంచేది సంతానమే. సంతానం లేని లోటు సర్వేశ్వరుడుకూడా తీర్చలేడేమో! "భగవంతుడా! నే నేం పాపం చేసేనని నా కీ శిక్ష విధించావయ్యా!" అంటూ తల బాదుకున్నాను.

ఇంతలో బయట తలుపులు దబదబా కొడుతున్నట్లయింది. దుప్పటి లాగిపారేసి తొట్రుపడుతున్న చీకుచ్వేళ్లు విచ్చి ఎట్టుకుని తలుపు తీయటానికి పరిగెత్తాను. వర్షంలో తడిసి ముద్దయి గజగజ చలికి వణికిపోతూ ఇంట్లో అడుగుపెట్టారు. తలుపులు మూసి త్వరత్వరగా ఇస్త్రీతువ్వాలు తీసి తల తుడిచాను. మడతలుంగీ ఇచ్చి నిప్పు చేసి తెచ్చాను. నేను పడుతున్న కంగారుకి కామోలు ఆయన కళ్లలో చిలిపిదలు కదులుతున్నాయి. లేక ఇంకా మధ్యాహ్నం సంఘటనే తలుచుకుని బాధపడుతున్నారో! ఏమిటో మరీ తొందరపాటు మనిషి. అనేస్తారు తరవాత బాధపడతారు. అంటే నేం తను పడకూడదా ఏమిటి? భర్త కనుక,అనురాగం ఉంది కనుకే అధికారంతో కొట్టగలిగారు. తా నందుకు బాధపడలేదు. ఆయనకి పిల్లలపై నుండే మక్కువ తనవల్ల తీరేది కాదుకదా అని తను బాధపడుతూంది. పక్కవాళ్ల పిల్లల్ని తెచ్చి గంటలకొద్దీ వాళ్లతో ముచ్చట లాడుతూంటే చిరాకి తనకి రంపపుకోతలా ఉంటుంది. 'తన కడుపు పండితే ఆయన కీ అవస్థ ఉండదు కదా!' అని వాపోతుంది మనస్సు. నేనేది లేక చెమ్మగిల్లిన కళ్లు వెంటతో ఒత్తుకుంటూ మంచం మీద వాలాను.

నా వెనకనే వచ్చిన శ్రీవారు, "శాంతి" అంటూ భుజం పట్టుకుని తనవేపుకి తిప్పుకున్నారు. నా కళ్లు వర్షం కురుస్తున్నాయి. లోతుగా నా కళ్లలోకి చూస్తూ తల నిమరసాగారు. ఇంత బాధలోను ఆయన అనురాగం హృదయానికి సాంత్వన కలగజేసింది. తీరని కోరికలుకూడా ఒక్కొక్కసారి తీయని అనుభూతుల్ని ప్రసాదిస్తాయి. బాధే సౌఖ్యమన్న భావం అలవరుచుకుంటే జీవించడం చాలా తేలిక. కానీ ఆ భావాన్ని సాధించడం అంత సులభసాధ్యం కాదుగా? ఏవేవో పిచ్చి పిచ్చి ఊహాలు మనస్సులో చోటు చేసుకుంటున్నాయి. మగతలో సోలిన కళ్లు ఏదో పీడ కల వచ్చి కెవ్వున కేకపెట్టడంతో మళ్లీ తెరుచుకున్నాయి. దీర్ఘాలోచనలో ఉన్న శ్రీవారు ఉలిక్కిపడి దగ్గరికి తీసుకున్నారు. ఇది మాకు మామూలే. నిద్రలో తప్పితే భయపడుతూనే ఉంటాను. ఆయన వేళాకోళం చేస్తూనే ఉంటారు.

"ఎందుకు, శాంతి, అలా భయపడ్డా" వన్నారు జుత్తు సరిచేస్తూ.

"ఏం లేదండి. ఏదో పీడ కల వస్తేనూ. . ."

"అదే, ఏమిటా కల? నాతో చెప్పకూడదా" అన్నారు.

తల ఊపాను చెప్పచ్చంటూ. కానీ ఆయన కళ్లలోకి చూసేసరికి నా మొహం వెలుగుతున్నాను. నాకు కావలసిన భావాలు ఆయన కళ్లలో దోబూచులాడుతూంది. 'హమ్మయ్య, పర్వాలే'దనుకున్నాను. గుండెలనిండా ఊపిరి పీల్చుకుని, ఎలా చెప్పాలా అని ఆలోచిస్తున్నాను.

"చెప్పు, శాంతి!" అంటూ ఆయన కుదపడం మొదలుపెట్టారు.

"సరే, వినండి" అన్నాను. "మరేమో కల వచ్చిందా" అంటూంటే. . . "ఔను, కల వచ్చింది. భయపడ్డావు. తరవాత? అదే ఎందుకు అరిచావు?" అన్నారు.

"ఆఁ నా కేమో అదేమిటో జరిగిందట. అయితే సరే, మీకు పిల్లలు కలగరని డాక్టరు చెప్పిందట! ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న మీరు తల పట్టుకుని నెక్కి పడిపోయారు. దాంతో నాకు భయం వేసి అలా అరిచే"నని గబగబా చెప్పేసి, ఆయన మొహంలోకి చూడ్డం మొదలుపెట్టాను. ఆయనలో భావసంచలనం తెలుసుకోవాలని ఆత్రత.

"హాఁస్! అంతేకదా! పిచ్చిపిల్లా, ఎందుకు మరీ అంతలా కుంగిపోవడం? పిల్లలు లేకపోతే మనమేం చేస్తాం? భగవంతుడి దయ ఇంతే ననుకుంటాను. అనవసరంగా అసలే బాధపడుతున్న నిన్ను నా కఠిన ప్రవర్తనతో మరింత వేధిస్తున్నాను కదూ? క్షమించు, శాంతి. ఇకమీదట నిన్ను జాగ్రత్తగా చూసుకుంటాను. నాకు తొందరపాటు ఎక్కువని తెలుసుగా నీకు! ఏమనుకోకు, శాంతి!" అంటూ ప్రాధేయపడుతున్నారాయన.

ఆయన్ని చూస్తూంటే దుఃఖం పెల్లుబికింది. "అయ్యో! అవేం మాటలండీ? ఊరుకోండి. నే నెప్పుడైనా మిమ్మల్ని పల్లెత్తుమాట అన్నానా?" అంటూ వెక్కుతున్నాను.

"అందుకే, శాంతి, ఇంత బాధ. నువ్వుకూడా నా మీద విసుక్కుంటే ఇంత బాధ పడేవాణ్ణి కాదు. నోరెత్తని అమాయక హృదయాన్ని ఇలా చిత్రవధ చేస్తున్నందుకే ఈ బాధ" అన్నారు నిట్టూరుస్తూ.

"ఛీ. . . ఊరుకోండి. చిత్రవధ చెయ్యడం ఏమిటి" అన్నాను కళ్లు తుడుచుకుంటూనే.

"శాంతి! నిజంగా నీ కెంత ఓరిమి, శాంతి! మీ వాళ్లు నీకు చక్కటి పేరు పెట్టారు" అంటూ పసిపిల్లని హత్తుకున్నట్లు గట్టిగా హృదయానికి హత్తుకున్నారు. "శాంతి, నువ్వే నాకు పాపాయివి. నువ్వు చాలు, శాంతి!" అన్నారు ఆప్యాయత తొణికిసలాడుతున్న మధురకంఠంతో.

'ఈ తృప్తిలోనే ఈ మధుర స్వప్నం కరిగిపోకుండానే ఈయన చేతుల్లో నా ప్రాణాలు అనంత విశ్వంలో కలిసిపోతే ఎంత బాగుణ్ను!' అనుకున్నాను. ఆయన బిగికౌగిలిలో ఊపిరి సలపక "అమ్మా" అంటూ విలవిల్లాడిపోసాగాను. గుండెల్లో గునపాలు మోగుతున్నాయి. బాధకి తట్టుకోలేకపోతున్నాను.

"అయ్యో, నీకేమైంది, శాంతి? చెప్పు, శాంతి", అంటూ ఆయన కలవరపడుతున్నారు. మగతలా వచ్చి కళ్లు సోలాయి.

"ఈవిడికి గుండెజబ్బు. ఇదివరకే మీకు చెప్పాను. మరోసారి ఇలా జరిగితే ప్రాణాలకే ముప్పు" అంటున్న డాక్టరు మాటలు ఎక్కడో అగాధంలోంచి వినిపించినట్లు ఉంది. 'భగవంతుడు నన్ను ఆశీర్వదించాడు. భగవంతుడు అనుగ్రహించాడు. ఈ తృప్తి చాలు. జీవితానికీ తృప్తి చాలు. . . చాలు' అనుకుంటూ ఆయన చేతులు గట్టిగా పట్టుకుంటూంటే కళ్లు మూతలు పడ్డాయి. ★